క్లుప్తంగా

అన్ని ధర్మాలకు మూలం సనాతనం



ర్యాలిలో వేద పఠనం చేస్తున్న పండితులు

కొత్తపేట: అన్ని ధర్మాలకు సనాతన ధర్మమే మూలమని, సనాతన ధర్మం ఉన్నచోట అన్ని ధర్మాలు వర్ధిల్లుతాయని ప్రముఖ వేదపండితుడు, ఘనాపాఠీలు అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి సమయమంతుల అండ్ మాతంశెట్టి వార్ల అన్నదాన సత్రంలో మంగళవారం వేద సభ నిర్వహించారు. దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి పర్యవేక్షణలో జరిగిన సభలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు, ఘనాపాఠీలు పాల్గొన్నారు. వారు చతుర్వేదములు, వేదములు పఠించి సనాతన ధర్మం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు.

రేపు వ్యాసరచన పోటీలు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 28న వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఏఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు అంగర వేణుగోపాలాచార్యులు (కృష్ణశ్రీ) తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ భాషా వేత్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ పోటీలను నిర్వహించనున్నామన్నారు. అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కథారచన పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ఎంపీడీఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడి చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న వారధి సభ్యులు

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన నయినాల జానవి అనే విద్యార్థినికి వైద్యం నిమిత్తం స్థానిక వారధి ఫౌండేషన్ సమకూర్చిన రూ.15 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ అధ్యక్షుడు శృంగారపు గంగాధర రామారావు, సభ్యులు దొంగ శివకృష్ణ, ఆచంట శ్రీను, ముద్దాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ర్యాగింగ్‌పై విచారణ చేయాలి

సఖినేటిపల్లి: రాజమహేంద్రవరం పరిధిలోని మోరంపూడి శ్రీచైతన్య హాస్టల్‌లో కలకలం సృష్టించిన ర్యాగింగ్‌పై సత్వర విచారణ చేపట్టాలని రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు, రామేశ్వరానికి చెందిన సరెళ్ళ విజయ్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సఖినేటిపల్లిలో మాట్లాడుతూ, హాస్టల్‌లో ఆలస్యంగా వెలుగు చూసిన శంకరగుప్తానికి చెందిన విద్యార్థి గుర్రం విన్సెంట్ ప్రసాద్‌పై సహచర విద్యార్థులు పైశాచికత్వం, ఐరన్ బాక్స్‌తో పొట్ట, చేతులపై విచక్షణా రహితంగా వాతలు పెట్టిన ఘటన తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

త్వరలో కాజ్‌వే అభివృద్ధి పనులు



రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: అప్పనపల్లి కాజ్‌వే అభివృద్ధికి రూ.16 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఆ పనులను వరదల సీజన్ ముగిసిన వెంటనే చేపడతామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. లూటుకుర్రులోని కాలువ గట్టు రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ అడబాల తాతకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే పాశర్లపూడిబాడవలో ముంపునకు గురైన పంట పొలాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించారు. ఓఎన్జీసీ అధికారులతో కలసి అక్కడ పర్యటించారు. ఓఎన్జీసీ నిర్మించిన రోడ్ల వల్ల పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఓఎన్జీసీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట కూటమి నేతలు ఉన్నారు.



మలికిపురంలో జోరుగా పండ్ల అమ్మకాలు



మలికిపురంలో విక్రయిస్తున్న కలువలు



మలికిపురంలో పత్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

ప్రథమ పూజ్యా.. వేంచేయవయా..

- అమ్మకాలు, కొనుగోళ్లతో కూడళ్లలో రద్దీ
- పత్రి, పండ్లు, పుష్పాల అమ్మకాలు
- నేటి నుంచే గణపతి నవరాత్రులు

మలికిపురం/కొత్తపేట: వినాయక చవితి నేపథ్యంలో గ్రామాల్లో సందడి నెలకొంది. బుధవారం చవితి సందర్భంగా ప్రతి గ్రామం, వీధుల్లోనూ వినాయక విగ్రహాలు నెలకొల్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలతో పాటు స్థానికంగా కళాకారులు రూపొందించిన మట్టి విగ్రహాలు సైతం భారీగా అమ్ముడుపోయాయి. ఇక గృహాల్లో చవితి పూజలకు ప్రధానమైన పత్రి, పండ్లు కొనుగోళ్లు కూడా భారీగా జరిగాయి. మంగళవారం మార్కెట్ పరంగా కొన్ని కూడళ్లు సెలవు దినం అయినప్పటికీ రావులపాలెం, కొత్తపేట, మలికిపురం, అంబాజీపేట, పి.గన్నవరం తాటిపాక, రాజోలు, మామిడికుదురు, ములికిపల్లి, లక్కవరం, ఆలమూరు, గంటి, ముక్కామల తదితర ప్రధాన కూడళ్లలో వినాయక పాలవెల్లి సామగ్రి అమ్మకాలు, కొనుగోళ్లతో రద్దీగా మారింది. విగ్రహాల మాట అటుంచితే పాలవెల్లి తోరణాల కోసం పత్రి, పండ్లు అమ్మకాలు భారీ ఎత్తున సాగాయి. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం) ఉచితంగా 21 రకాల పత్రిని సేకరించి సుమారు 100 మందికి పంపిణీ చేశారు. కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు తయారు చేసిన సుమారు వంద వినాయక ప్రతిమలను పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. వారి అధ్యాపకులు అభినందించారు.

అనేక మందికి ఉపాధి

వినాయక చవితి నేపథ్యంలో పత్రి, పండ్లు, పుష్పాల అమ్మకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది పేదలకు ఉపాధి లభిస్తుంది. లంక గ్రామాల్లో లభించే వివిధ మొక్కలు, ఆకులను సేకరించి పత్రి పేరుతో విక్రయాలు సాగిస్తూ పేదలు ఉపాధి పొందుతారు. ప్రధానంగా టేకుచెట్ల ఆకులు, పూతలు, ఉసిరి, మారేడు, తులసి, జామ, నేరేడు, సీతాఫలం తదితర ఆకులను సేకరించి మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. అలాగే అరటి, జామ, సీతాఫలం, బత్తాయి, నారింజ, మొక్కజొన్న, యాపిల్, దానిమ్మ, తదితర పండ్లు కూడా భారీగా విక్రయాలు సాగాయి. ఒక వివిధ రంగుల్లోని చామంతి పుష్పాలు కూడా పెద్ద ఎత్తున విక్రయాలు సాగాయి. అలాగే కలువ పువ్వుల అమ్మకాలు కూడా భారీ ఎత్తున సాగాయి. కేవలం వినాయక పాలవెల్లికి అలంకరించే పత్రి, పండు, పుష్పాల అమ్మకాలు, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు రూ.కోటికి పైగా జరిగాయని అంచనా. రాజోలు దీవికి దూర ప్రాంతం నుంచి రవాణా ఉంటుంది కనుక ఇక్కడ వీటి ధరలు అధికంగానే పలికాయి.



చవితికి ముస్తాబైన కొత్తపేట కళానగర్ గణపతి ఆలయ ప్రాంగణం



మామిడికుదురులో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల ప్రదర్శన

పకడ్బందీగా ఏర్పాట్లు

ఇక ఉత్సవాల నేపథ్యంలో రావులపాలెం, పి.గన్నవరం, రాజోలు సర్కిళ్ల పరిధిలో అటు పోలీసు, ఇటు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రక్షణ చర్యలతో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీలతో సీఐలు, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, ఎటువంటి అల్లర్లు జరకకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం వేళ కూడా ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: వినాయక చవితి సందర్భంగా మంగళవారం మార్కెట్ కొనుగోలుదారులతో కళకళలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్‌లో సందడి నెలకొంది. మండలంలోని అప్పనపల్లి, పాశర్లపూడి, మామిడికుదురు, కొమరాడ, మగటపల్లి, మొగలికుదురు, జగ్గన్నపేట, తదితర గ్రామాల్లోని సెంటర్లలో భారీగా దుకాణాలు ఏర్పాటు చేశారు. భక్తులు ఎంతో ఉత్సాహంగా పూజకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు.

పసుపు, కుంకుమ, పలు రకాల పుష్పాలు, కంది పప్పు, తమలపాకులు, కొబ్బరి పీచు, పిండి, కూరగాయలు, పండ్లు వంటి పలు రకాలతో తయారు చేసిన వినాయకుని బొమ్మలతో మామిడికుదురు దీప్తి స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అలాగే ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం మట్టితో వినాయకుని బొమ్మలు తయారు చేశారు. వాటిని స్కూల్లో ప్రదర్శించారు.



అంతర్వేది దేవస్థానంలో మట్టి గణపతి ప్రతిమలు తయారు చేసున్న విద్యార్థులు

చవితి ఏర్పాట్లు పూర్తి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చవితి ఏర్పాట్లు అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు దర్శించుకునేందుకు వీలుగా బారికేడ్లు నిర్మించారు. స్వామి వారిని ఉచిత దర్శనం ద్వారా, అలాగే ప్రత్యేక దర్శనం ద్వారా దర్శించుకునేందుకు ఏర్పాట్లు జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఆలయ కమిటీలు చవితికి ఏర్పాట్లు చేశాయి.



గొలకోటివారి పాలెంలో ఆకట్టుకుంటున్న వినాయకుని రథం



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ఆలయ ధ్వజ స్తంభాలకు పుష్పాలంకరణ

మాజీ సీఎం జగన్‌ను కలసిన 'పాముల'



పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాముల దేవీప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, సీనియర్ నేత తోరం సూర్యభాస్కర్ మంగళవారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

రాజోలు కోర్టు ఏపీపీగా 'ఆచంట'



రాజోలు: స్థానిక కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా సీనియర్ న్యాయవాది ఆచంట శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర హోం మంత్రిత్వశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయని శ్రీనివాస్ తెలిపారు. 2015–20 కాలంలో ఏపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. రెండో పర్యాయం ఏపీపీగా నియమితులైన శ్రీనివాస్‌ను రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పలువురు అభినందనలు తెలిపారు. తన నియామకానికి సహకరించి మాజీ ఏజీపీ చెల్లింగి వెంకటేశ్వర్లు, న్యాయవాది బోళ్ల సత్యానందంతో పాటు సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు పాపయ్యపంతులు, వెంపరాల కామేశ్వరరావు, పీవీ కృష్ణంరాజు, ఆకుల భాస్కరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

భీమ్‌రత్న అవార్డుకు తాతారావు ఎంపిక



మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన జాలెం తాతరావును రాష్ట్ర దళిత చైతన్య వేదిక ప్రతిష్టాత్మకమైన భీమ్‌రత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 29న నగరంలో జరిగే సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేస్తామని దళిత చైతన్య వేదిక నుంచి లిఖితపూర్వకంగా లేఖ వచ్చిందని తాతారావు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. తాతారావు అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం

మామిడికుదురు: స్థానిక జెడ్పీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థి రాజోలుకు చెందిన గుమ్మల దుర్గాప్రసాద్ ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించి సత్తా చాటాడు. స్కూల్లో మంగళవారం జరిగిన సమావేశంలో అతడితో పాటు తల్లి కనకదుర్గను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం బి.చిరంజీవిరావు ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. దుర్గాప్రసాద్ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుని చదువుకున్న స్కూల్‌కు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు దొంగ సత్యనారాయణ, భూపతి మనోహరరాజు తదితరులు అభిలషించారు.

మదర్ థెరిసా ఆదర్శమూర్తి



సఖినేటిపల్లిలో అనాథ ఆశ్రమానికి పరుపులు ఇస్తున్న క్లబ్ అధ్యక్షుడు ఫిలిప్ రాజు



అంబాజీపేటలో మదర్‌థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, సర్పంచ్



నగరంలో మదర్‌థెరిసాకు నివాళులర్పిస్తున్న స్థానికులు

మామిడికుదురు: కరుణామూర్తి మదర్‌థెరిసా ఆదర్శనీయురాలని నీతిపూడి గణపతిరావు శ్లాఘించారు. ఆమె జయంతిని పురస్కరించుకుని నగరం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదర్‌థెరిసాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూనపరెడ్డి సురేష్, స్థానికులు ముత్యాల సత్యనారాయణ, కందాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రపంచానికి సేవా మార్గం చాటి విశ్వమాతలా మదర్‌థెరిసా పేరుగాంచారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. ఉందుర్తి నాగబాబు ఆధ్వర్యంలో మంగళవారం థెరిసా జయంతి సందర్భంగా అంబాజీపేట హైస్కూల్ ఎదురుగా ఉన్న థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, పత్తి దత్తుడు, మాచవరపు శివన్నారాయణ, యర్రంశెట్టి పాండురంగారావు, వీరిన గోపాలం పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో..

సఖినేటిపల్లి: స్థానిక మూడు తూముల సెంటర్ వద్ద కేకేఎస్ఎంఆర్ ట్రస్టు నిర్వహణలో ఉన్న అనాథ ఆశ్రమంలో మంగళవారం నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసా పుట్టినరోజు వేడుకలు మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు గెద్దం ఫిలిప్‌రాజు అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. ఆశ్రమానికి పది పరుపులను క్లబ్ ద్వారా అధ్యక్షుడు ఫిలిప్‌రాజు పంపిణీ చేశారు. పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు, చాక్‌లెట్స్ బాక్స్‌లు, ఫ్రూట్స్ అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, మదర్ థెరిసా అందించిన సేవలను కొనియాడారు. క్లబ్ కార్యదర్శి బందెల సంపత్ కుమార్, రొటేరియన్స్ గెద్దం పేర్రాజు, గెద్దం తులసీ భాస్కరరావు, జి.జేసురత్నం, ఆశ్రమం నిర్వాహకులు కాట్రు నతానియేలు, కిమ్ నాథన్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం



చిట్టిబాబుకు సాయం చేస్తున్న సంస్థ ఎన్నారై చిన్ని

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంకలో మంగళవారం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పెదపాటి చిట్టిబాబుకు వైద్యం ఖర్చులకై రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హేండ్స్ సంస్థ పంపిణీ చేసింది. ఈ మేరకు సంస్థ ఎన్నారై మెంబర్ తాడి చిన్ని చేతుల మీదుగా రోగికి ఇచ్చారు. అనంతరం అంతర్వేదిపాలెంలోని చిల్డ్రన్ హోంలోని పిల్లలకు భోజన వసతి కల్పించారు. రాపాక చిన్ని, నల్లి ప్రసాదరావు, పాలపర్తి శేఖర్, నల్లి మోహన్, చింతా వికాస్ పాల్గొన్నారు.

అంటువ్యాధుల నిర్మూలనపై విస్తృత ప్రచారం



పెదపళ్లలో అంటువ్యాధుల నిర్మూలనపై ఇటుక బట్టీ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: వర్షాకాలం సీజన్ దృష్ట్యా వ్యాప్తి చెందే అంటువ్యాధుల నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలపై వైద్య ఆరోగ్య సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎస్.లక్ష్మీ స్నేహ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్దకు వెళ్లి వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షిత నీటిని తాగాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధమైన ఆరోగ్య సమస్యలు ఉన్నా సత్వరమే సమీప ఆరోగ్య సిబ్బంది ద్వారా ఆస్పత్రికి విచ్చేసి చికిత్స పొందాలని సూచించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెచ్ఈఓలు ఏవీవీ రాజా, బి.సూర్య నారాయణ, హెచ్‌వీ ఆర్.బాలామణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు.

తాగునీటి చెరువులో పాము కళేబరం



నీటిలో తేలుతున్న పాము, చేప కళేబరాలు

మామిడికుదురు: ఈదరాడ తాగునీటి చెరువులో పాము కళేబరంతో మంగళవారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పాముతో పాటు చేప చనిపోయి నీటిపై తేలుతూ కనిపించాయి. అవి కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. తాగే నీటిలో పాము, చేప చనిపోవడంపై కలవరం చెందారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీని వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే రెండు జంతువుల కళేబరాలను తొలగించామన్నారు. పూర్తిగా ప్యూరిఫై అయిన నీటినే సరఫరా చేస్తున్నామని, దీనిపై ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న డీవైఈఓ రామలక్ష్మణమూర్తి

కె.గంగవరం: కొత్తగా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లో నూటికి నూరు శాతం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా మెరుగైన విద్యను అందించాలని రామచంద్రపురం డివిజన్ డీవైఈఓ రామలక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో నూతనంగా అప్‌గ్రేడ్ అయిన కోట, భట్లపాలిక ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత విద్యార్థుల హాజరు శాతం, పాఠశాల రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సులువు పద్ధతిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా మంచి ఉత్తీర్ణత సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు కూడా ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉపాధ్యాయులకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఎంఈఓ-2 చోడిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలకు సమానత్వ హక్కులు కల్పించాలి

కొత్తపేట: అమ్మాయికి జననం నుంచే విద్య, ఉద్యోగంలో ప్రాధాన్యం ఇస్తూ వారి ఉన్నత భవిష్యత్‌కు అన్ని రంగాల్లో సమానత్వ హక్కులు కల్పించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి అన్నారు. మంగళవారం 'మహిళా సమానత్వ దినోత్సవం' పురస్కరించుకుని బాలికా విద్య, స్త్రీ హక్కులు తదితర అంశాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ నాగరాణి ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ద్రౌపదిముర్ము మన రాష్ట్రపతిగా, అంతర్జాతీయ స్థాయిలో పీవీ సింధు, మేరీకోమ్, మిథాలీరాజ్ వంటి క్రీడాకారిణులు దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. పూర్వం నుంచి మన దేశంలో చరిత్ర సృష్టించిన మహిళామూర్తులను ఆదర్శంగా తీసుకోవడం ద్వారా మహిళలు విద్య, ఉద్యోగాలు, క్రీడలు, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. ముందుగా మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.అంకమరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.